అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మూడు గ్రామాల్లో గడపగడపకు తిరిగిన ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


రేపల్లెలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరవుతాయని, ప్రతి ఇంటికీ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండలంలోని రేపల్లె, టీఓపల్లె, బసిరెడ్డిపల్లె గ్రామాల్లో శనివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్ రెడ్డి, నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ఇంటింటికి వస్తున్నామని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని సకాలంలో పరిష్కరిస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పథకాలను వారి ఇంటి వద్దకే చేర్చుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు తెలిదెల లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలనరసింహారెడ్డి, టీఓపల్లె సర్పంచ్ మునీంద్ర, ఎంపీటీసీ సీమోన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మహానందీశ్వర్‌రెడ్డి, నీలానందరెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, వ్యవసాయాధికారి మ్యాగీ, సీడీపీఓ సావిత్రమ్మ, హౌసింగ్ ఏఈ మహబూబ్‌బాషా, పంచాయతీ రాజ్ ఏఈ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శి గొర్రె శ్రీనివాసులు పాల్గొన్నారు.

మరిన్ని సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని మంత్రికి వినతి


మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : పోరుమామిళ్లలో జరిగే ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యేందుకు వెళుతున్న రాష్ట్ర గనులు, విద్యుత్, అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బద్వేలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు నియోజకవర్గంలోని పలు మండలాల్లో మరికొన్ని సబ్‌స్టేషన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ మంత్రి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించిన ఆయన తక్షణమే మంజూరు చేయిస్తానని తెలిపారు. ఆయనకు బద్వేలు, గోపవరం, బి.కోడూరు మండలాల నాయకులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లెస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, ఏపీఐఐసీ స్టేట్ డైరెక్టర్ గోపవరం ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మిదేవి శ్రీరాములు, వైస్‌చైర్మన్ ఎస్.సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయికృష్ణ, జెడ్పీటీసీ పోలిరెడ్డి, బి.కోడూరు వైస్ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపాలిటీ నాయకులు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న మండల సర్వసభ్య సమావేశం

గోపవరం : ఈనెల 26వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరినారాయణ తెలిపారు. ఎంపీపీ ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. అన్నిశాఖల అధికారులు ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, చేపట్టబోయే పనుల వివరాలతో నివేదికలతో సమావేశానికి హాజరు కావాలన్నారు.

ఘనంగా జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

బద్వేలు అర్బన్ : ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు శనివారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరాశ్రయుల వసతిగృహంలో కేక్ కట్ చేసి అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ ఎన్టీఆర్ యూత్ అసోసియేషన్ సభ్యులు వీరేంద్ర, దిలీప్, మధు, ఆదర్శ్, సురేష్‌లతో పాటు నిరాశ్రయుల వసతిగృహం నిర్వాహకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవాతత్పరుడు రామస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో శనివారం ఉపాధ్యాయ సేవాతత్పరుడు రామస్వామి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు రామస్వామి జిల్లా, రాష్ట్ర ఉపాధ్యాయులకు అమూల్యమైన సేవలు అందించారని కొనియాడారు. ఆర్జేయూపీ నాయకుడు విజయమోహన్‌రెడ్డి, ఎంటీఎఫ్ నాయకులు రామచంద్ర, మధు, రఫీ, శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

రేపు పల్లవోలులో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం

చాపాడు : చాపాడు మండల పరిధిలోని పల్లవోలు గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల రెవెన్యూ కార్యాలయాన్ని పరిశీలించిన జేసీ


అధికారులతో మాట్లాడుతున్న జేసీ గణేష్ కుమార్

ప్రొద్దుటూరు : జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ శనివారం ప్రొద్దుటూరు మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. జేసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిమారు ఆయన కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ ఛాంబర్, రికార్డు రూం, వీఆర్‌ఓల కార్యాలయం, ఎన్నికల కార్యాలయంతోపాటు అన్ని గదులను పరిశీలించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డు రూం నిర్వహణతోపాటు అధికారులు అందిస్తున్న సేవలపై జేసీ సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ నజీర్ అహ్మద్, డీటీలు మనోహర్‌రెడ్డి, సుదర్శన్, సతీష్, ఆర్‌ఐ నాగమోహన్‌రెడ్డి, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రీ సర్వేపై జేసీ ఆరా

రాజుపాళెం : ప్రస్తుతం జరుగుతున్న సమగ్ర భూ రీ సర్వేపై జిల్లా జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ ఆరా తీశారు. రాజుపాళెంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం జేసీ ఆకస్మికంగా తనిఖీ చేసి అందుకు సంబంధించిన వివరాలను తహసీల్దార్ ఇందిరా రాణి, డిప్యూటీ తహసీల్దార్ వెంకట సాయినాథరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆధునికీకరించిన తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిన్నారుల్లో శారీరక అభివృద్ధికి కృషి


అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న సంసిద్ధతా ఉత్సవం

పోరుమామిళ్ల : అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల్లో జ్ఞాపకశక్తి, శారీరక అభివృద్ధి, సృజనాత్మకత పెంపొందించడం, బుద్ధివికాసం, భాషాభివృద్ధి పెంపొందింప చేయడం కోసం సంసిద్ధతా కార్యక్రమం చేపట్టామని పోరుమామిళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మిదేవి తెలిపారు. శనివారం ఆమె గిరినగర్-1 అంగన్‌వాడీ సెంటర్‌లో సంసిద్ధతా ఉత్సవం నిర్వహించి మాట్లాడారు. పిల్లల అభివృద్ధి కొరకు ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. సంస్థ సూపర్ ట్రైనర్ స్వరూపరాణి పిల్లలకు పరీక్ష నిర్వహించారు. జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, కార్యదర్శి రాజీవ్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల వికాసానికి జరుగుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సూపర్‌వైజర్ మాధవి, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్స్ పాల్గొన్నారు.

ముగిసిన కాన్ఫరెన్స్ ఈఆర్ఎస్ఈఎం-23


సర్టిఫికేట్‌లను అందచేస్తున్న వీరకుమార్‌రెడ్డి, వీరకళ్యాణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని సాయిరాజేశ్వరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎమర్జింగ్ రీసెర్చ్ ఇన్ సైన్స్, ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ (ఈఆర్ఎస్ఈఎం-2023) శనివారం ముగిసింది. ఈ కార్యక్రమంలో సివిల్, ఈఈఈ, మెకానికల్, ఈసీఈ, సీఎస్ఈ, ఎంబీఏ విభాగాలకు సంబంధించి మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్‌లతోపాటు పలు రాష్ట్రాలకు చెందిన ఇంజనీర్లు, సైంటిస్టులు పాల్గొన్నారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ బసిరెడ్డి వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి మాట్లాడుతూ కాన్ఫరెన్స్‌లో 160 మందికి పైగా పాల్గొని తాము రూపొందించిన ప్రజెంటేషన్ ప్రదర్శించారన్నారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డిరాజేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, అకడమిక్ డీన్ సుబ్బారెడ్డి, ఏఓ జగదీశ్వరరెడ్డి, హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చేనేత సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రొద్దుటూరు : చేనేత సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి శనివారం ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి.శివనారాయణ, కార్యదర్శి ఓబులేసు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ వస్త్ర రంగానికి భారమైందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు 3 సెంట్ల స్థలం ఇచ్చి గృహాలు నిర్మించుకునేందుకు రూ.6లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. గతంలో చేనేత కార్మికుడికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇచ్చేవారని, దానిని పునరుద్ధరించాలన్నారు. నాయకులు పి.లక్ష్మీనారాయణ, సంజీవరాయుడు, ధనుంజయ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి


గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడుతున్న సెక్రటరీ అమీరుద్దీన్

దువ్వూరు : గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సెక్రటరీ అమీరుద్దీన్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన దువ్వూరు గ్రంథాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్జెక్టు నిపుణులు అందించే సలహాలను, సూచనలను విద్యార్థులు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ సహకారాలతో డీడీయూజీకేవై పథకం ద్వారా సీడప్ సౌజన్యంతో వైఎస్సార్, ప్రకాశం, కర్నూలు, అనంతపురం జిల్లాల్లోని గ్రామీణ నిరుద్యోగ యువతకు నాలుగు నెలల కాలవ్యవధిలో ఉచితంగా కంప్యూటర్ హార్డ్‌వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్టు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7013665112 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు అభివృద్ధి పనులకు భూమి పూజ

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో రూ.282 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆదివారం ఉదయం 9 గంటలకు భూమి పూజ చేయనున్నారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలోని ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరు కానున్నారు. పూర్వం నిర్మించిన పైపులైన్ ద్వారానే నేటికీ ప్రజలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కొత్త పైపులైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. పట్టణ పరిధిలో రూ.119 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నారు. రూ.163 కోట్లతో ప్రధాన డ్రైనేజీ కాలువల ఆధునీకరణ, మురికినీటి శుద్ధి ప్లాంట్ పనులు చేపట్టనున్నారు. అలాగే డ్రైనేజి కాలువల పనులను ప్రారంభించనున్నారు. పట్టణాభివృద్ధికి సంబంధించి ఈ రెండు సమస్యలు పరిష్కారమైతే ప్రజలకు ఎంతో ఊరట లభిస్తుంది.

చలివేంద్రాన్ని ప్రారంభించిన రూరల్ సీఐ


చలివేంద్రం ప్రారంభిస్తున్న రూరల్ సీఐ నరేంద్రరెడ్డి

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ మైనుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం వలన పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ నాగేంద్ర ప్రసాద్, పోలీసు సిబ్బంది, గ్రామీణ మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని ముందుకు తీసుకెళ్దాం


సమావేశంలో మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి

రాజుపాళెం : ప్రస్తుతం ఆధునిక వ్యవసాయ రంగంలో రైతులను అభివృద్ధి పరిచేందుకు కృషి చేయాలని మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి అన్నారు. మండల పరిషత్ సభా భవనంలో నారాయణరెడ్డి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట సాగులో రసాయనిక ఎరువులు పురుగుమందుల వాడకం తగ్గించేందుకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నూతన వంగడాలతో అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అంగన్‌వాడీ పాఠశాలల నిర్వహణపై శ్రద్ధ చూపి విద్యారంగాన్ని ప్రోత్సహించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మోహన్ మాట్లాడుతూ ట్యాంకుకు నీటిని ఎక్కించి ప్రతి ఇంటికి కొళాయి ద్వారా మంచినీటిని అందిస్తామని, ప్రస్తుతం నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గాదెగూడూరు పశు వైద్యాధికారి ప్రదీప్‌రెడ్డి మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని రైతులు పశువులు కదల్లేని పరిస్థితిలో ఉన్నప్పుడు 1962 నంబరుకు రైతు ఫోన్ చేస్తే వెంటనే సంచార వాహనం వచ్చి పశువుకు వైద్యం చేస్తారని తెలిపారు. ఏపీఓ గంగయ్య మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద కాలువల్లో పూడికతీత పనులు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు మాట్లాడారు. జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు సుభాషిణి, ఎంపీడీఓ సయ్యదున్నీసా, సర్పంచులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు


నరసాపురంలో బండలాగుతున్న వృషభరాజులు

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామంలో పోలేరమ్మ తిరునాల సందర్భంగా శనివారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఉదయాన్నే గ్రామస్తులు పోలేరమ్మకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బండలాగుడు పోటీల్లో 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. ప్రకాశం జిల్లా చలికురువ గ్రామానికి చెందిన వీరాస్వామిచౌదరికి చెందిన వృషభాలు ప్రథమ బహుమతి రూ.లక్ష, ప్రకాశం జిల్లా అగ్రహారం గ్రామానికి చెందిన నాగశివశంకర్‌కు చెందిన వృషభాలు రెండవ బహుమతి రూ.75 వేలు, కాశినాయన మండలం ఆనంవారిపల్లె గ్రామానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డికి చెందిన వృషభాలు మూడవ బహుమతి రూ.50 వేలు, నరసాపురం గ్రామానికి చెందిన ప్రతాపరెడ్డికి చెందిన వృషభాలు నాల్గవ బహుమతి రూ.40 వేలు, కడప జిల్లా వెలవలి గ్రామానికి చెందిన రసూల్‌కు చెందిన వృషభాలు ఐదవ బహుమతి రూ.30 వేలు, నంద్యాల జిల్లా పి.ఆర్.పల్లెకు చెందిన నాగయ్యకు చెందిన వృషభాలు ఆరవ బహుమతి రూ.20 వేలు గెలుచుకున్నాయి.

'ఆరోగ్యం మన చేతుల్లోనే'


మాట్లాడుతున్న డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉంటుందని ప్రముఖ డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో శనివారం వేసవి శిక్షణ శిబిరంలో 'ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎలా?' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజారామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో నీరు ఎక్కువగా తాగాలని తెలిపారు. వ్యాధుల నుంచి ఎదుర్కోవాలంటే నీటిని కాచి తాగాలని సూచించారు. సెల్ ఫోన్‌ను తక్కువగా, అవసరం మేరకే వినియోగించాలని, లేని పక్షంలో వారికి మానసిక వ్యాధులతోపాటు కంటి చూపు తగ్గిపోయే ప్రమాదం ఉందని, చెవుడు వచ్చే అవకాశాలున్నాయన్నారు. నోటి ఆరోగ్య సమస్యలు రానీయకుండా దంతాలను రోజుకు రెండు సార్లు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ప్రతి రోజు రాత్రి 9 గంటలకు నిద్రపోవడం, ఉదయం 5 గంటలకు నిద్ర లేచి చదువుకోవాలని సూచించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, లాయర్ హరిత, అక్షయ, చరణ్, హాసిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అభిమానంతోనే చర్చి నిర్మాణానికి సహాయం


కూలూరులో నగదు అందజేస్తున్న నారాయణరెడ్డి

రాజుపాళెం : ఎస్సీ కాలనీ ప్రజలపై ఉన్న అభిమానంతోనే చర్చి నిర్మాణానికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తున్నానని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి అన్నారు. మండలంలోని కూలూరు గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద నూతనంగా నిర్మిస్తున్న చర్చి నిర్మాణాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ ఈ చర్చి నిర్మాణానికి సహాయం అందించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ చర్చి ప్రారంభం అనంతరం కాలనీల్లో సీసీ రోడ్లు వేస్తారన్నారు. ముందుగా ఎమ్మెల్యే గ్రామంలోకి రాగానే డప్పు వాయిద్యాలతో స్వాగతం పలికారు.

రూ.13 లక్షలు అందించిన ఎమ్మెల్యే

గతంలో కాలనీ వాసులు, సంఘ పెద్దలు చర్చి నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యేను అడుగగా ఆయన సొంత నిధులు రూ.13 లక్షలను శనివారం అందించారు. ఆ మొత్తాన్ని మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, గోపాయపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డిలు సంఘ పెద్దలకు అందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, సర్పంచ్ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, సచివాలయాల కన్వీనర్ వెలవలి శేఖర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ జ్ఞానానందం, ఆయా గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'ఆర్ఆర్ఆర్'లో ప్రజలు భాగస్వాములు కావాలి



మేరీ లైఫ్ - మేరీ స్వచ్ఛనగర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

బద్వేలు అర్బన్ : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో మేరీ లైఫ్ – మేరీ స్వచ్ఛనగర్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి తెలిపారు. ఈనెల 20 నుంచి జూన్ 5 వరకు జరగనున్న అవగాహన కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కమిషనర్ ప్రారంభించి మాట్లాడారు. 15 రోజుల పాటు పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలో రీసైకిల్‌కు ఉపయోగపడే పాత వస్తువుల సేకరణ చేపడుతున్నామని, ప్రజలు తమ వద్ద ఉన్న రీసైకిలింగ్‌కు ఉపయోగపడే వస్తువులను ఆర్ఆర్ఆర్ సెంటర్లలో అందజేయాలని, ఆయా వస్తువులను అవసరమైన వారికి అందజేయడంతో పాటు మిగిలిన వాటిని రీసైకిలింగ్‌కు పంపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలంతా విరివిగా పాల్గొనేందుకు అవగాహన కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మునికుమార్, ఆర్ఐలు రెడ్డి కుమార్, ఖాజాహుస్సేన్, సీనియర్ అసిస్టెంట్ పవన్, డీపీఓ సునీల్, సచివాలయ శానిటేషన్ సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోండి


కస్తూర్బా గాంధీ స్కూలులో విద్యార్థులకు అందే భోజనం పరిశీలిస్తున్న దృశ్యం

ఖాజీపేట : ప్రభుత్వ సదుపాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా విజ్ఞప్తి చేశారు. ఖాజీపేటలోని ప్రభుత్వ కార్యాలయాలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని వాటిని లబ్ధిదారులకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.



క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జేష్టమాసం మొదటి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచే స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. భక్తుల దర్శనార్థం స్వామివారిని ప్రత్యేక అలంకరణలో ఉంచారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. పూజారి పెంచలయ్యస్వామి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం వద్ద మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గంగమ్మకు విశేష పూజలు


భక్తులకు అన్నదానం చేస్తున్న రాజగోపాల్

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలో ఆవుల పబ్బం (గంగ జాతర) సందర్భంగా శనివారం గ్రామ దేవత గంగమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రొద్దుటూరు కృష్ణాలయ కమిటీ చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భక్తులకు రాజగోపాల్ అన్నదానం ఏర్పాటు చేశారు.

సమ్మర్ క్యాంపులో ఆటల పోటీలు


బహుమతులు ఇస్తున్న దాదాపీర్

పోరుమామిళ్ల : పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం లైబ్రేరియన్ ఆఫ్రిది విద్యార్థులకు చదరంగం, లుడో, బిజినెస్‌మెన్, కథల పోటీలు నిర్వహించారు. విజేతలు మోక్షిత, ఆలియా, అమన్‌లకు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గసభ్యులు దాదాపీర్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రతి వారం వివిధరకాల పోటీలు నిర్వహించి వారికి బహుమతులు అందజేస్తామన్నారు. విద్యార్థులు సమ్మర్ క్యాంపులో పాల్గొని వినోదం, విజ్ఞానం పొందాలన్నారు.

విజ్ఞానంతోపాటు వినోదం

రాజుపాళెం : వేసవి శిక్షణలో భాగంగా గ్రంథాలయాల్లో విద్యార్థులకు విజ్ఞానంతోపాటు వినోదాన్ని అందిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి ప్రతాపుడు పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం ఉపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి కథలు చెప్పి వాటి భావాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొంటున్నారని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం


చలి వేంద్రం వద్ద మజ్జిగ అందచేస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద ఏఎస్పీ ప్రేరణాకుమార్ శనివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభమై ఎండలు విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా పాదచారులు, పట్టణ ప్రజలు, ఆటో డ్రైవర్లు, చిరువ్యాపారుల దాహం తీర్చేందుకు ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి పాల్గొన్నారు.

శ్రీకృష్ణుని రూపంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు సరికాదు

చాపాడు: ఖమ్మంలో శ్రీకృష్ణుని రూపంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం దురహంకార చర్య అని జాతీయ వాద రచయితల సంఘం ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు పెరుగు భవానీ శంకర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకృష్ణుని రూపంలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనుమతించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎంతో మంది అభిమానం చూరగొన్న, ముఖ్యమంత్రిగా ప్రజలకు చేసిన సేవలను గుర్తిస్తూ ఎన్టీఆర్ విగ్రహాలను ప్రతి ఊరిలో ఏర్పాటు చేసుకోవచ్చని దేవుడి రూపంలో ఏర్పాటు చేయడం దురహంకార చర్య అన్నారు.